# క్రీడలతో శారీరక దారుఢ్యం

మన్ననూర్: క్రీడలతో శారీరక దారుఢ్యం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఫ్రెండ్లీ వాలీబాల్ ఓపెన్ టూ ఆల్ క్రీడోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతతతోపాటు స్నేహభావం పెరుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలు, సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలన్నారు. మరో రెండు నెలల్లో జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలు నిర్వహించడంతో పాటూ అప్పాపూర్ లో ఆదివాసి చెంచుల కోసం ప్రత్యేకంగా క్రీడోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గిరిజన ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అంతకు ముందు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వాలీబాల్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీస్ విధానం కొనసాగిస్తామన్నారు. పోటీల్లో మొత్తం 9 జట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పాల్గొన్నారు. మొదటి బహుమతి పదర మండల కేంద్రం క్రీడాకారులకు రూ.15 వేల నగదు. ద్వితీయ బహుమతి పదర మండలం జ్యోత్యానాయక్ తండా క్రీడాకారులకు రూ. 10 వేల నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు శంకర్, రవీందర్, హెచ్ఎం సిద్దార్థ మహదేవ్, ఎస్ఐలు రమేష్, రాజు, లెనిన్, రాము, జగదీష్, గౌస్ పాషా, పీఈటీ మల్లయ్య, పోలీస్ సిబ్బంది నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున్, హరినాయణ, బుచ్చయ్య, వెంకటరమణ, సత్యనారాయణ, బాలింగంగౌడ్, రేణయ్య, మేరాజ్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా బాలికల అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల క్రీడామైదానంలో శనివారం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) ఆధ్వర్యంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని లింగాల, కొల్లాపూర్, బల్మూర్ మండలాలకు చెందిన 8 పాఠశాలల నుంచి 105 మంది బాలికలు పాల్గొన్నారని నిర్వాహకులు ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రాధమ్మ తెలిపారు. 60, 100, 200 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్ పుట్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మొదటి, రెండవ స్థానంలో విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు అనంతపురంలో జరిగే కేంద్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, ఆయా పాఠశాలల నుంచి వచ్చిన 15 మంది పీఈటీలు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆయా పోటీలలో విజేతలు**

అండర్-14 విభాగంలో 60 మీటర్ల పరుగులో మొదటి స్థానంలో ఎం.జ్యోత్స్న(కొండనాగుల), రెండో స్థానంలో శ్రీవాణి(లింగాల), లాంగ్ జంప్‌లో పి.భువనేశ్వరీ(బల్మూర్), టి.శ్రీవాణి(అంబట్‌పల్లి), షార్ట్ పుట్‌లో ఎం.జ్యోత్స్న(కొండనాగుల), ఆర్.వైష్ణవి(బల్మూర) నిలిచారు. అదే విధంగా అండర్-16 విభాగంలో షార్ట్ పుట్‌లో జి. సరిత(లింగాల), ఆర్. సంజన(బల్మూర్), లాంగ్‌జంప్‌లో ఎ.నిఖిత(కొండనాగుల), ఆర్. సునిత(లింగాల) 200 మీటర్ల పరుగులో కె.దివ్య(చెంచుగూడెం), ఎ.నిఖిత(కొండనాగుల), 100 మీటర్ల పరుగులో ఆర్.నందిని(బల్మూర్), ఆర్.స్వప్న(నార్లాపూర్) విజేతలుగా నిలిచారు.

## ప్రత్యేక న్యాయవాదిని నియమించాలి

మన్ననూర్: అచ్చంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏజెన్సీ కోర్టులో స్పెషల్ న్యాయవాదిని నియమించి నియోజకవర్గంలోని ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని యురేనియం వ్యతిరేక జేఏసీ కన్వీనర్ కల్ముల నాసరయ్య శనివారం ఎమ్మెల్యే వంశీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. నల్లమల ప్రాంతంలోని ప్రజల మధ్యన వచ్చే తగాదాలు, ఘర్షణలకు ప్రధాన కారణం భూ సమస్యలేనని వివరించారు. ఆర్డీఓ సివిల్ కోర్టులో భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. నాయకులు బాలింగంగౌడ్, తిరుమలయ్య, మల్లికార్జున్, రేణయ్య, నిరంజన్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ గోరెటి చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తెలకపల్లి: ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరిగే అన్యాయాన్ని శాసనమండలిలో ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న మాట్లాడటాన్ని స్వాగతిస్తూ శనివారం మాలమహానాడు నాయకులు స్థానిక పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి మాట్లాడుతూ ప్రజాగాయకుడు గోరెటి వెంకన్న ఎస్సీ వర్గీకరణపై ఘాటుగా స్పందించడం హర్షణీయమన్నారు. వర్గీకరణతో ఎస్సీల ఐక్యతకు విఘాతం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల భాస్కర్, శ్యామ మహేష్, చంద్రయ్య, రాజేంద్రప్రసాద్, మధు, శేఖర్, చిన్నయ్య, రమేష్, జగదీష్, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులు ప్రారంభం

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరు పాఠశాల అభివృద్ధి పనులను శనివారం మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజలు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.40 లక్షల నిధులు కేటాయించిందన్నారు. పాఠశాలను మాడల్ స్కూల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, మాజీ



భూమి పూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు

సర్పంచ్ నల్లపోతు గోపాల్, విజయగౌడ్, కలీల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు పట్టాలివ్వాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

తాడూరు: ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి మోకాపై ఉన్న రైతులకు పట్టాలిచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గుంతకోడూరులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 20 మంది దళితులకు అసైన్‌మెంట్ సర్టిఫికెట్ ప్రభుత్వం 1998లో టీడీపీ ప్రభుత్వంలో అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి రైతులకు సర్టిఫికేట్లు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రభుత్వం రికార్డులలో ఎక్కించకుండా రైతులు కార్యాలయాల చుట్టు, అధికారులు చుట్టు తిరగడం తప్ప ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి రికార్డులలో నమోదు చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 100 ఎకరాలకు పైగా ఆయా గ్రామాల్లో అసైన్‌మెంట్ కమిటీ భూమి ఉందని 15 ఏళ్ల కిందట అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి నేటి వరకు చాలా మంది దళితులు, బీసీలు, బలహీన వర్గాలు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటూ రికార్డులలో నమోదు చేయకపోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న రైతుబీమా, బ్యాంకు రుణాలు, రైతు భరోసా అందడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జోక్యం చేసుకొని అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మణ్యం, చంద్రయ్య, బంగారయ్య, పరశురాములు, మల్లేష్ పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి కొమ్ము సింధూర చదువుని మిత్తం కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్ రూ.10 వేల ఆర్థికసాయాన్ని విద్యార్థిని తండ్రి వెంకటయ్యకు శనివారం అందించారు. సింధూర మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్‌లో మూడో సంవత్సరం చదువుతోంది. గతంలో రూ.20వేలు ఆర్థికసాయం చేసినట్లు సంజీవ్ కుమార్ తెలిపారు. రమేష్, దినేష్ ఉన్నారు.

లింగాల: మండల కేంద్రానికి చెందిన కేతావత్ మణిబాయి శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచన మేరకు ఆయన రూ.5 వేల ఆర్థికసాయంతో పాటు బియ్యం అందజేశారు.

## అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

బల్మూర్: అదనపు కట్నం వేధింపులపై వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని బాణాల గ్రామానికి చెందిన గాజుల వసంతకు తెలకపల్లి మండలం కార్వంగకు చెందిన శివయ్యతో పదేళ్ల కిందట వివాహం అయ్యింది. మూడేళ్ల నుంచి రూ.2 లక్షలు అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. దీంతో వసంత ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళల అదృశ్యం: కేసు నమోదు

బల్మూర్: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూర్య వెంకటమ్మ అదృశ్యమైన ఘటనపై శనివారం కేసు నమోదైంది. ఏఎస్ఐ రేణయ్య వివరాల ప్రకారం గత నెల 27న వెంకటమ్మ ఇంటి నుంచి వెళ్లింది. ఎంత వెతికినా ఆమెకి తెలవకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ తెలిపారు.

**బాణాలలో మైనర్ బాలిక..**

మండలంలోని బాణాలలో మైనర్ బాలిక అదృశ్యమైంది. బాలిక తల్లి అహల్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కోడేరు: మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన తెలుగు వెంకటయ్య వ్యవసాయ పొలం దగ్గర సురమోని మల్లేష్, దేశమోని రామకృష్ణ, మరో కొంత మంది వ్యక్తులు శనివారం పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ. 1600 నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. మేడిమాకుల కురుమయ్య, వడ్డే లక్ష్మయ్య, తుమ్మలి మధు పరారయ్యారని పేర్కొన్నారు.

## శ్రీశైలానికి పోటెత్తిన పర్యాటకులు



దోమలపెంట: శ్రీశైలం ప్రాజెక్టును తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం ప్రాజెక్టు వద్ద యువకులు, యువతులు కేరింతలు కొడుతూ సెల్ఫీలు దిగారు. పర్యాటకులు పోటెత్తడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ పెరిగింది. రహదారిపై వాహనాలు బారులు తీరాయి. మన్ననూర్ చెక్ పోస్టు నుంచి కుంచోని వరకు వాహనాలు బారులు తీరి ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయి.

## క్లుప్తంగా

### గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేస్తాం

నాగర్‌కర్నూల్: జిల్లాలో నాన్ లేఅవుట్ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ప్రభుత్వం విధించిన గడువు మార్చి 2025 నాటికి సజావుగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి భూపాల్ పల్లి జిల్లా ఐడీఓసీ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిషోర్ కలిసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు ఎల్‌ఆర్‌ఎస్‌పై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని విధాల అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రులకు వివరించారు. అదనపు కలెక్టర్ కే సీతారామారావు, డీపీఓ కృష్ణ, కలెక్టరేట్ తహసీల్దార్ కార్తీక్ కుమార్, నరేష్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

కల్వకుర్తిరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సత్యసాయి సేవా సమితి అధ్యాపక బృందం విద్యార్థులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనివారం సత్యసాయి విద్యాజ్యోతి పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు, దేశభక్తి పాటలు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విద్యార్థులు కళలను ప్రదర్శించారు.

### రేపు సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 5న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ కోటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

### విద్యార్థులకు పలకలు, పెన్నులు పంపిణీ



కోడేరు: మండల కేంద్రంలోని వడ్డేవాడ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు సత్యసాయి విద్యాజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఉచితంగా పలకలు, పెన్నులు, పెన్సిలు, నోట్ బుక్స్ శనివారం కన్వీనర్ రాఘవేంద్రశర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో యుగేందర్‌రెడ్డి, దూరెడ్డి స్వాతి, ఉపాధ్యాయులు జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పశువైద్యాధికారికి ఘన సన్మానం



తెలకపల్లి: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం మండల పశువైద్యాధికారి నాగరాజు యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. మండలంలో 15 సంవత్సరాలుగా పశువైద్యాధికారిగా సేవలందించి ఇటీవల బదిలీ అయ్యారు. నూతనంగా పశువైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ మధుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: మండలంలోని పర్వతాపూర్‌కు చెందిన పెద్ద శ్యామలయ్య, కంట్రోల్ అనే ఇద్దరు బైక్‌పై గ్రామం నుంచి తెలకపల్లికి వెళ్తున్నారు. మండల కేంద్రం నుంచి పర్వతాపూర్‌కు మరో వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. శ్యామలయ్యకు, కంట్రోల్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

## స్వచ్ఛత, పచ్చదనంపై అవగాహన

తెలకపల్లి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి రాంలాల్ మండలంలోని అన్ని గ్రామపంచాయతీ ఐకేపీ వీఓఏలు, ఆరోగ్య ఉపకేంద్రాల ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ నెల 5 నుండి 9వ తేది వరకు జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. వీఓఏలకు ఆరోగ్యం పరిశుభ్రతపై చూసుకోవాల్సిన బాధ్యత ఏఎన్ఎంలపై ఉందన్నారు. గ్రామ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, యువత ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలన్నారు. తాగునీటి వనరులను శుభ్రం చేయడం, ప్రతి రోజు క్లోరినేషన్ చేయడం అన్ని కాలనీలను సందర్శించి సమస్యలు పరిష్కరించడం, చెరువులు, కుంటలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ లింగయ్య, ఏపీఓ మల్లేష్, మహేంద్ర స్త్రీనిధి ఆర్ఎం వెంకటేష్, ఏపీఎం నిరంజన్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఊర్కొండ: రాష్ట్ర ప్రభుత్వం 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛత, పచ్చదనం కార్యక్రమంపై శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి సంతోష్‌రావు గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామలలో వన మహోత్సవం కింద మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాంలాల్

కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ నాయక్ వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు



పెంట్లవెల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ అనంతలక్ష్మి



మన్ననూరులో..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో 1వ సెక్టార్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీడీపీఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. సూపర్‌వైజర్‌లు అనంతలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని రామచంద్రాపురంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి పవన్, అంగన్‌వాడీ టీచర్ పూజ, ఉపాధ్యాయులు, గర్భిణులు ఉన్నారు.

వెల్దండ: పిల్లలకు తల్లిపాలే శ్రేష్టమని సూపర్‌వైజర్ శ్రీమతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు బాలామృతం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాసమ్మ, శివలీలా, మల్లమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలలో చిన్నారులకు సూపర్‌వైజర్ పద్మావతి అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో వైద్యురాలు లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, అరుణ, జ్యోతి, ఆశావర్కర్లు మున్నీసా మయూరి, ఆయాలు ధనమ్మ, నీలమ్మ, చిన్నారుల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని వీరంరాజ్‌పల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ భారతి, ఏఎన్ఎం పద్మ, కార్యదర్శి రమాదేవి, ఆశకార్యకర్త యశోద, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవంలో సూపర్‌వైజర్ వనజ హాజరయ్యారు. ఎంపీడీఓ జ్యోతిపరోసియా, విజయ, శాంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం తుర్కపల్లి, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎం జ్యోతిరాణి ఆధ్వర్యంలో బదిలీల ప్రక్రియలో పదోన్నతి పొందిన నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన వారిని జీవ శాస్త్ర నల్లమల ఫోరం ఆధ్వర్యంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వెంకటేశ్వర శర్మ, ఫోరం అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యాయులు అంజిలాల్, అరవింద్, కొర్రశంకర్, బిక్కు, సీతారాంనాయక్, భారతి, చంద్రకళ, సుచరిత తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన నల్లమల జీవశాస్త్ర ఫోరం

## జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం అదనపు కలెక్టర్ సీతారామారావు వినతిపత్రం అందజేశారు. 30 సంవత్సరాల కిందట నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని వివరించారు. తరగతి గదుల పైకప్పు సిమెంట్ రేకులతో నిర్మించారని ఏర్పడిన చిన్న చిన్న రంధ్రాల ద్వారా వర్షం తరగతిగదిలో పడుతోందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేష్, మధు, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి–గాన్‌గట్టుతండాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో గాన్‌గట్టుతండా వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డును పోతేపల్లి వరకు పూర్తి చేయాలన్నారు. సీసీ రోడ్డు, అండర్ డ్రెయినేజీ, నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పత్యనాయక్, గోపాల్‌నాయక్, తండావాసులు తదితరులు ఉన్నారు.

## మందకృష్ణ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొల్లాపూర్: మూడు దశాబ్దాల కాలంపాటు అలుపెరగకుండా పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ కృషితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వర్గీకరణ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్ల శివమాదిగతో పాటు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ మాదిగ మాట్లాడారు. మాదిగ జాతి కోసం రాజీలేని పోరాటం చేసిన ఘనత మందకృష్ణకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీజీ సెంటర్ అధ్యాపకులు రవీంద్రనాథ్, సురేందర్, దేవరాజ్, సంతోష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్టపాగ రాము, శీలం అగ్రస్వామి, సులిగిరి శ్రీనివాస్, మిద్దె కృష్ణయ్య, పరశురాం, నాగరాజు, రాజమౌళి, రమేష్ తదితరులున్నారు.

## మహాసభల పోస్టర్ విడుదల

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఈఈ ఆఫీస్‌లో బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన అమృత్సర్‌లో నిర్వహించే 9వ జాతీయ ఓబీసీ మహాసభలకు పోస్టర్‌ను శనివారం బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్ రద్దు, అట్రాసిటీ కేసుల నుంచి బీసీలకు మినహాయింపు, ప్రతి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌లలో ఒక బీసీ సెల్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించనునట్లు పేర్కొన్నారు. బీసీ ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని 'చలో అమృత్సర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీసీ ఉద్యోగ సంఘం, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం నాగభూషణం, బి.శివుడు తదితర బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

తెలకపల్లి: మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని బారిగారి నవ్యశ్రీ కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బాలు, కరస్పాండెంట్ రఘురాంరెడ్డి తెలిపారు. గత నెలలో జరిగిన మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో విద్యార్థిని నవ్యశ్రీ తెలంగాణ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ కరీంనగర్‌కు ఎంపిక కావడంపై విద్యార్థిని అభినందించారు.

**ఏఈఈలుగా ఎంపికైన పూర్వ విద్యార్థులు**

కేకేరెడ్డి పాఠశాల పూర్వ విద్యార్థులు ఎం సాహితి, క్రాంతికుమార్ రెడ్డి, శరత్‌రెడ్డిలు ఏఈఈలుగా ఉద్యోగాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు. మిషన్ భగీరథలో ఏఈలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

కోడేరు: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల, గురుకుల పాఠశాలల్లో అధ్యయన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మురుగు నిల్వ ఉండి దుర్గంధపు వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాములు, వెంకటస్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## గుంతలోపడి మతిస్థిమితం లేని వ్యక్తిమృతి

వెల్దండ: రాచూర్ సమీపంలో రోడ్డు పక్కన ఓ గుంతలో పడి మతిస్థిమితం లేని మహ్మద్ నిరంజన్(67) అనే వ్యక్తిమృతి చెందినట్లు శనివారం పోలీసులు గుర్తించారు. వారి కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని బాల్‌రాంనగర్ కాలనీకి చెందిన మహ్మద్ నిరంజన్ గత 6 నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నారు. ఇప్పటికే మూడుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వెతికి ఇంటికి తీసుకొచ్చారు. గత నెల 25న సైతం నిరంజన్ ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఎక్కడా కనిపించకపోవడంతో అదే నెల 26న కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆయన కుమారుడు అన్వర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. కాగా రాచూర్ సమీపంలోని ఓ గుంతలో వ్యక్తిపడి మృతి చెందినట్లు గుర్తించిన గంగదారి శ్రీశైలం పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని వెల్దండ ఎస్ఐ కురుమూర్తి పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహ్మద్‌కు భార్యతో పాటు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.